
# బదిలీ లీల

ఆకెళ్ళ శివప్రసాద్



**"విజయనగరం ట్రాన్స్‌ఫర్ చేశారు ...' ' అంటూ విచారంగా వచ్చాడు వెంగళరావు.**

అదే విజయవాడ అయితే అంతెత్తు ఎగిరి గంతేసి, ఆర్డరు ఇచ్చిన ఆఫీసర్ని అమాంతం ఆలింగనం చేసేసుకుని 'అందమే ఆనందం' పాట సోలోలో పాడేసుకునేవాడు. ఆ ఒక్కటీ అడక్కు అన్నట్టు ఎప్పుడు విజయవాడకి ట్రాన్స్‌ఫర్ చేయమన్నా అక్కడికి తప్పించి ఎక్కడెక్కడికో విసురుతున్నారు. ఓసారి ఒరిస్సా బోర్డర్‌లో వేస్తే, ఇంకోసారి మహారాష్ట్ర అంచుల దగ్గర, అది ఇదీ కాకపోతే తమిళనాడు తంబిల మధ్య.

'కన్నడో, తిన్నడో' అంటూ కన్నడిగుల మధ్య కనికరం లేకుండా ఎసిరేస్తున్నారు.

"ఇదెక్కడి పితలాటకమండీ, బాబూ!" ఆర్డర్ చూసుకుని ఏడవాలో, నవ్వాలో తెలీని మొహం పెట్టాడు.

"పోనీలే గురూ! ట్రాన్స్‌ఫర్ పేరుతో మన మాప్‌లో ఉన్న ఊళ్లన్నీ చుట్టేస్తు న్నారు!" అన్నాను నవ్వుతూ నేను.

"ఏం చూడడమండీ, బాబూ! సామాన్లు సర్దుకున్నంతసేపు ఉండడంలేదు ఏ ఊళ్లోనూ!" అని కర్చీఫ్‌తో ముక్కుని, కళ్లని ఏకకాలంలో తుడుచుకుంటూ-"హాయిగా విజయవాడలో అయితే కృష్ణ నీళ్లు తాగుతూ ఖుషీ ఖుషీగా గడుపుదును!" అన్నాడు.

"అసలు జాయినింగ్‌రిపోర్ట్ కన్నా ముందు ట్రాన్స్‌ఫర్ రిక్వెస్టు పెట్టడంతో ఈ ఇబ్బంది వస్తోంది. సెక్షన్ ఎలాట్ కన్నా ముందు ఊరు ఎలాట్ చేసేస్తున్నారు!" చిత్రంగా నవ్వుతూ అన్నాడు పుండరీకం.

"విజయనగరమంటే గురజాడవారి ఊరు. ఎంజాయ్!" కపీశ్వరుడని ముద్దుగా మేమంతా పిలుచుకునే మా ఆఫీసు కవీశ్వరరావు 'సెండాఫ్ పంచరత్నాలు' తయారుచేస్తూ అన్నాడు.

"పది రోజుల్లో వెళ్లి జాయిన్ అవ్వాలి. రిక్వెస్ట్ కనుక సొంత ఖర్చులతో పోవాలి!" అదోలా అయిపోయాడు.

నాకు గుర్తున్నంతవరకు ఆరేళ్ల క్రితం కాటా బస్తాలా ఉన్న వెంగళరావు, ఈ ఆరేళ్లలో అరవై ఊళ్లు తిరిగి, అరగజం ఎత్తు, అరవై కేజీలు బరువు

తగ్గి ఉంటాడు. సొంత ఊరు విజయవాడ. మొదట హెడ్డాఫీసులో పోస్టింగ్ ఇచ్చినా, ఆ తరువాత నుండి విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని నిశ్విప్రయత్నం చేస్తున్నాడు. కనిపించని దేముళ్లతోపాటు కన్పించే దేవుళ్లుగా పేరుగాంచిన పెద్ద వాళ్లందర్నీ కలుస్తున్నాడు. ఖాయంగా విజయవాడ పోస్టింగ్ వస్తున్నదని ఈస్ట్‌మన్ కలర్ కలలు కంటున్న తరుణంలో తంజావూరుకి దగ్గరగానో, సిల్లేర్‌కి చేరువలోనో పోస్టింగ్ ఇస్తున్నారు. మా హెడ్డాఫీసులో వాళ్లకి కూడా 'మోటసరసం' ఎక్కువనిపించింది. వెంగళరావు విజయవాడ మెట్రో అంటున్నా బొత్తిగా పట్టించుకోవడంలేదు.

"ఏదో ఒకటి చేయాలి, గురూ!" బల్లని గుద్దితే బలంగా దెబ్బ తగులు తుందని, ఫైల్లమీద భారీ పంచ్ ఇస్తూ అన్నాడు.

"విజయనగరంలో రిపోర్టు చేయడమే!" బేలగా అన్నాను నేను.

"ముస్తాఫా ముస్తాఫా! డోంట్ వర్రీ ముస్తాఫా!' ' అంటూ అసందర్భంగా హమ్ చేసి, "అవిడియా!' ' అన్నాడు ఆనందంతో - ఐడియా మాట రూపుని మార్చేస్తూ కవీశ్వరరావు.

''ఏంటేంటేంటీ?'' ఆనందవడాలో, ఆశ్చర్యపోవాలో తెలియక రెండింటి మధ్యస్థ ఫీలింగ్ పెట్టి అడిగాడు వెంగళరావు.

"బి.బి. రావును కలిస్తే...?"

"బి.బి. రావా? ఎవరా మనిషి? ఏమా కథ?"

"బదిలీల బాబూరావు. ఎవరికి ఏ ట్రాన్స్‌ఫర్ కావాలన్నా ఏ మంత్రమో, తంత్రమో చేసి చేయిస్తాడు. అంటార్కిటికా ఖండంలో ఉన్న మనిషి అంబాజీపేట కావాలన్నా, అమలాపురంజీవి అండమాన్ నికోబర్ ఐలండ్స్‌కి పంపాలన్నా అతనికే సాధ్యం!" అన్నాడు.

"మరింత కాలం ఎందుకు చెప్పలేదు?" కోపంగా అరిచాడు.

"ఈమధ్యే బదిలీమీద ఇక్కడికి వచ్చాడు!" అని నవ్వేశాడు.

"ఇహ ఆలస్యం వద్దు! వెంటనే పద!" ఆర్డరు పుచ్చుకుని కవీశ్వరరావుని తోసుకుంటూ కదిలాడు వెంగళరావు.

* * *

బదిలీల బాబూరావు విషయం విని, 'విషయం' మాట్లాడుకుని, "కమాన్!" అన్నాడు ఫాలో కమ్మన్నట్టు.

గాంగ్ లీడర్ వెనకగా నడిచినట్టు నడిచాము. తిన్నగా బదిలీల లీలలు చేసే బదిలీ సెక్షన్ చేరుకున్నాము. ఆ సెక్షన్ వాళ్లు ఎప్పుడూ ఏదో ఒక గూడు పుఠాణి చేస్తూంటారు. ముగ్గురికి పాత సిన్మాల్లో దొంగలు పెట్టుకునే కళ్లజోళ్లు ఉన్నాయి.

"వెంగళరావుగారి ఫీలు ఇవ్వండి!" బదిలీ బాబూరావు అడిగాడు వినయంగా.

"క...క.... కాన్ఫిడెన్షియల్!" నత్తిగా గొణిగాడు సెక్షన్ హెడ్.

''నేనెవరో తెలుసా?'' బస్తీమే సవాల్ అన్నట్టుగా చూశాడు బదిలీ బాబూ రావు.

"మీరు ..."

''తలుచుకుంటే బదిలీల సెక్షన్‌ని బదలాయించగలను ...'' ఘనచరిత్రకు సంబంధించిన పాఠం విప్పబోతుంటే- ఏమనుకున్నాడో ఏమో తెలియదు కానీ వెంగళరావు ఫైలు ఇస్తూ ఆముదం తాగినవాడిలా మొహం పెట్టాడు. ఫైలుమీదకి రిలే నిరాహార దీక్ష చేసినవాళ్లు బిర్యానీ మీద పడ్డంత ఆబగా పడ్డాము.

వెంగళరావు అప్లికేషన్, దాని కింద ఆఫీసు నోట్. ఆఫీసు నోట్‌లో - "వెంగళ రావుగారు విజయవాడ అడుగుతున్నారు. కచ్చితంగా వీరి సంబంధీకులు ఎవరో అక్కడ ఉండి ఉంటారు. వారికి ఫేవర్ చేయడానికే ఈయన కనిపించకుండా కంకణం కట్టుకున్నాడు. అంచేత విజయవాడకి బదులు విజయనగరం ట్రాన్స్‌ఫర్ చేయాలని నిర్ణయించడం జరిగింది" అని రాసి ఉంది.

ఆ నోట్ చూసి, అంతా 'ఔరా!' అని ఒకరి ముక్కులమీద మరోకరు వేళ్లు వేసుకున్నాము.

బదిలీ బాబూరావు నోట్ చదివి, పాములు పట్టేవాడిలా మొహం పెట్టి, బ్రహ్మాండమైన పాయింట్ దొరికినట్టు - "ఫాలో మీ!" అని రెచ్చిపోయాడు.

ఫాలో అయ్యాము.

వెంగళరావు ముదురు బుగ్గల్ని ముచ్చటగా నిమిరాడు. "వెరీ సింపుల్! విజయనగరం వెళ్లి ఆనవాయితీ ప్రకారం జాయినింగ్‌రిపోర్ట్‌తోనే ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్ పెట్టండి!" అని గోడలకి చెవులుంటాయని వెంగళరావు పక్కనే ఉన్న మా చెవుల్లో కూడా పడకుండా ఏదో చెప్పాడు.

* * *

సరిగ్గా మూడు నెలలకి-

వెంగళరావు శత దినోత్సవం ఆడిన సినిమా ప్రొడ్యూసర్‌లా ఇంత మొహం చేసుకుని, ఆఫీసులో వాళ్లతోపాటు, ఆ పూట ఆఫీసుకి చేగోడీలు, జంతికలు, చవన్‌ప్రాశ్‌లు అమ్ముకోవడానికి వచ్చిన వాళ్లందరికీ కూడా కాకినాడకాజా పంచిపెట్టాడు.

'జననీ జన్మభూమిశ్చ' శ్లోకం చదివి, విజయవాడ వెళ్తున్నందుకు వెయ్యి విధాల వెర్రానందం పొందాడు.

బదిలీల బాబూరావు చిద్విలాసంగా బదిలీ నాటక సూత్రధారిలా గల్లాపెట్టి శబ్దం చేస్తూ నవ్వాడు.

ఇంతకీ వెంగళరావు విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయిన వృత్తాంమెట్టిదనిన -

ఎప్పుడూ విజయవాడే కావాలని అప్లికేషన్ పెట్టే వెంగళరావు బదిలీ బాబూరావు సలహా మీద విజయవాడ తప్పించి ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయండని అప్లికేషన్ పెట్టాడు. విజయవాడ తప్పించి ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయమన్నాడంటే వెంగళరావు విజయవాడలో ఉన్న ఆఫీసర్‌కి భయపడుతున్నాడనీను, ఏవో లొసుగులు ఉండబట్టే విజయవాడ వద్దంటున్నాడనీను అపార అపార్థాలు లాగేసి పనిష్మెంట్‌గా విజయవాడే ట్రాన్స్‌ఫర్ చేయాలని నోట్ రాసి అప్రూవల్ తీసుకున్నారు మా బదిలీల సెక్షన్ వాళ్లు!

Ⓟ

